క్లుప్తంగా

శ్రీచెంగాళమ్మ ఆలయంలో ఆకస్మిక తనిఖీలు


శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో అధికారులు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు, పూజలు, సేవలు, విరాళాలు తదితర వివరాలపై ఆరా తీశారు. అన్ని రికార్డులను పరిశీలించారు. అంతా సవ్యంగా ఉండడంతో ఆయన సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మికి తగు సలహాలు, సూచనలిచ్చారు.

గ్రామాల్లో 104 వైద్య సేవలు

దొరవారిసత్రం: నెలబల్లి, పొలెంపాడు గ్రామాల్లో శుక్రవారం 104 వాహన సేవలు ద్వారా రోగులను పరీక్షించి మందులు అందజేశారు. బీపీ, షుగర్ తదితర రోగులను పరీక్షించడంతోపాటు సాధారణ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

క్యూ కట్టిన రోగులు


దక్కిలి ఆరోగ్య కేంద్రం వద్ద జనం క్యూ

దక్కిలి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం రోగులు ఉదయాన్నే ఆస్పత్రికి చేరుకుని ఓపీ వద్ద క్యూ కట్టారు. సీజనల్ వ్యాధులు విపరీతంగా ప్రబలుతుండడంతో రోగులు వైద్యం కోసం నిరీక్షిస్తున్నారు.

ఏకొల్లులో ఫ్రైడే డ్రైడే


ఏకొల్లులో క్లోరినేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి లార్వా సర్వే చేశారు. ఇళ్ల ఆవరణ, వీధుల్లో నీటి నిల్వలపై బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ పనులు చేపట్టారు. అంతేకాకుండా తొట్టెల్లో, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీళ్లను వైద్య సిబ్బంది గుర్తించి తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓకు సన్మానం

ఓజిలి: ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీఓను నాయకులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ప్రసాద్‌నాయుడు, మీనాక్షి, మాజీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, నాయకులు ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, సుబ్బారావుయాదవ్, సురేష్‌రెడ్డి, దామోదర్‌రాజు, పోలయ్య, సర్పంచ్‌లు ప్రభాకర్‌రాజు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిల్లకూరు: మండలంలోని కడివేడు గ్రామంలో గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయింది. బాధిత కుటుంబానికి శుక్రవారం ఎమ్మెల్యే ద్వారా రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధితుడు రుద్రకోటికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తానంకి నానాజీ సహకారంతో రూ.15 వేలను స్థానిక నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసులరెడ్డి, బి.సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బేరిపేట క్రిస్టియన్ శ్మశాన వాటిక సమీపంలో ఇనుప విద్యుత్ స్తంభం తొలగింపు పనులను శుక్రవారం చేపట్టారు. తుప్పు పట్టిన విద్యుత్ స్తంభంపై సాక్షి దినపత్రికలో కథనం రావడంతో అధికారులు స్పందించారు. తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్తదాన్ని ఏర్పాటు చేసి, విద్యుత్ తీగలను సరి చేశారు.

29 నుంచి ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమ్మె

నాయుడుపేట టౌన్: ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29వ తేదీ నుంచి సమ్మెకు పూనుకుంటున్నట్లు ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు వెల్లడించారు. శుక్రవారం నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. చనిపోయిన సిబ్బందికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, రూ.10 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని తమ ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు.

అరకొర వసతుల ఆరోగ్య కేంద్రం

వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



గోనుపల్లిలోని విలేజ్‌హెల్త్ సెంటర్



రాపూరు: మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం వంద మంది వరకు రోగులు వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. ఈ కేంద్రంలో స్టాఫ్ నర్సు, అంటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో 17 విలేజ్ హెల్త్ సెంటర్లలో జోరేపల్లిలో మాత్రం ఎంఎల్‌హెచ్‌పీ పోస్టు ఖాళీగా ఉంది. వేపినాపిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు అదనపు గదులు నిర్మించలేదు. అలాగే స్టాఫ్‌రూం లేదు. స్టాఫ్ క్వార్టర్స్‌లేవు. వెయిటింగ్ హాల్ కూడా లేకపోవడంతో ఆరోగ్యసిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఒకరు 104 డ్యూటీపై వెళుతుంటారు. ఆరోగ్యకేంద్రంలో వైద్యులు సెలవుపై వెళ్లితే రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యులు ఇక్కడికి వస్తుంటారు. మండలంలోని విలేజ్ హెల్త్ సెంటర్‌లు ఉండడంతో రోగులు ప్రాథమిక చికిత్స చేయించుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మెరుగైన వసతులు కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నా.

వైద్య కేంద్రాలు ఘనం... సేవలే శూన్యం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పరిధిలోని వైద్యఆరోగ్య కేంద్రాలు ఎంతో ఘనంగా ఏర్పాటు చేసి ఉన్నారు. అయితే వైద్య సేవలు అందించడంలో మాత్రం విఫలమవుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో శిథిలస్థితిలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.5.50 కోట్ల నిధులతో అధునాతనంగా మార్చారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ పర్యవేక్షణ లోపించి వైద్య సేవలు అతంత మాత్రంగానే ప్రజలకు అందుతున్నాయి. పట్టణంలోని ఆరోగ్య సామాజిక కేంద్రంలో (30 పడకలు అసుపత్రి)సూపరింటెండెంట్ వైద్యురాలితో పాటు మరో నలుగురు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. అన్ని వసతులు ఉన్నప్పటికీ వివిధ రకాల అపరేషన్‌లు, కాన్పులు చేయడంలో చాలావరకు విఫలమవుతున్నారు.

నిరుపయోగంగా ట్రామా కేర్ సెంటర్

పట్టణంలోని సామాజిక ఆరోగ్యం కేంద్రం వద్ద 2011లో రూ.65 లక్షల నిధులతో ప్రారంభించిన ట్రామా కేర్ సెంటర్ అప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంది. వైద్య పరికరాలు, వైద్యులు లేకపోవడంతో ఈ కేంద్రం మూతపడింది. నాయుడుపేట జాతీయ రహదారులకు కూడలి ప్రాంతంగా ఉండడం, ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండడంతో 13 ఏళ్ల కిందట ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఈ భవనాలు మూతబడి ఉన్నాయి. అప్పట్లో సుమారు రూ.25 లక్షలతో వ్యయంతో అధునాతనంగా ట్రామా కేర్ సెంటర్‌కు అందించిన అంబులెన్స్ కూడా తుప్పు పట్టి ఎందుకు పనికిరాకుండా పడి ఉంది.

నిర్లక్ష్యానికి నిదర్శనం

మండల పరిధిలోని 12 కిలోమీటర్లు దూరంలో గొట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇక్కడ వైద్యులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో కూడా తెలియని పరిస్థితి. ఇక్కడి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఇక్కడి సీహెచ్‌సీకు అనుబంధంగా మండలంలో 7 ఆరోగ్య ఉప కేంద్రాలు, 6 విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ఉన్నాయి. ఇక్కడ వైద్య సిబ్బంది నామమాత్రంగానే వైద్య సేవలు అందిస్తున్నారు. అర్బన్ హెల్త్ క్లినిక్‌లలో కూడా వైద్య సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి. తుమ్మూరు, ఎల్ఏ సాగరం అర్బన్ హెల్త్ సెంటర్‌లలో కూడా వైద్య సేవలు నామమాత్రమే. పట్టణ పరిధిలో ఉన్న ఈ అర్బన్ సెంటర్‌లలో రోజుకు 50 ఓపీలు కూడా రావడం లేదు.


నాయుడుపేటలో నిరుయోగంగా ఉన్న ట్రామాకేర్ సెంటర్

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు, అటెండర్, జోరేపల్లిలోని ఎంఎల్‌హెచ్‌పీని నియమించాల్సి ఉంది. వైద్యశాలకు ప్రభుత్వం అన్నిరకాల మందులు అందిస్తోంది. అలాగే అదనపు గదులు, వెయిటింగ్ హాల్ నిర్మిస్తే సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు స్పందించి అన్నిరకాల వసతులు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ప్రమీలా రాజకుమారి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు


రాపూరు-వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట రూరల్: పేర్నాడు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేవలం సిబ్బంది మాత్రమే వైద్యం చేస్తున్నారు. డాక్టర్ ఎస్.రమణయ్య వైద్యశాలకు సక్రమంగా రావటడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని 19 పంచాయతీలు ఉన్న వైద్య సబ్ సెంటర్లు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లలోనే ఎక్కువ మంది చికిత్స చేసుకుంటున్నారు. అయితే తీర ప్రాంతలైన కొరిడి, దామరాయి, కడపత్ర పంచాయతీలలోని 27 గ్రామాలకు కడపత్ర పంచాయతీ పేర్నాడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే దిక్కు. ఈ పంచాయతీలకు రోడ్డు వసతి కూడా అంతంత మాత్రమే. దీంతో మూడు పంచాయతీల ప్రజలు పీహెచ్‌సీపైనే ఆధారపడి ఉన్నారు. వైద్యులు అందుబాటు లేక పోవడంతో గ్రామీణులు వైద్యం కోసం నానా అవస్థలు పడుతున్నారు.


తుప్పపట్టిన అంబులెన్స్

పాత మందులతోనే సరి

– కొత్త ప్రభుత్వం చేసింది శూన్యం

చిల్లకూరు: గత ప్రభుత్వం పలు రకాల వ్యాధులకు పీహెచ్‌సీలలో అందుబాటులోకి తెచ్చిన మందులే నేడు కూడా వాడుతున్నారు. గూడూరు నియోజకవర్గంలోని పలు పీహెచ్‌సీలను శుక్రవారం పరిశీలించగా గతంలో అందించే మందులు మాత్రమే రోగులకు అందిస్తున్నారు. నాడు-నేడు కింద గత ప్రభుత్వంలో శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో నూతన భవనాలను నిర్మించారు. రోగులకు మంచి సౌకర్యాలు కల్పించడంతో అవే నేటికీ ఉన్నాయి. కొత్తగా మందుల ఇండెంట్ కూడా వైద్య ఆరోగ్య వాఖ ఇప్పటి వరకు పెట్టలేదు. దీంతో నాటి మందులే ఉపయోగిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కోట మండలంలోని పీహెచ్‌సీలలోనూ మందుల కొరత లేదు. అలాగే సిబ్బంది కూడా నిండుగా ఉన్నారు. వాకాడు మండలంలోని పీహెచ్‌సీలలో కూడా మందుల కొరత లేదు. ఓపీ బాగా సాగుతోంది. గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరులోని పీహెచ్‌సీలో కూడా మందులకు ఢోకాలేదు.


కోటలో రోగికి సెలైన్ పెట్టి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్టమూరు మండలంలోని పీహెచ్‌సీలలోనూ ఎలాంటి ఇబ్బంది లేదు.

సిబ్బంది కొరత

వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెం, నిడిగుర్తి, వాకాడు, చినతోట గ్రామాల్లోని పీహెచ్‌సీలలో బాలిరెడ్డిపాళెంలో ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు, వాకాడులో ఒక డాక్టర్, నిడిగుర్తిలో వైద్య సిబ్బంది పోస్టులు, చినతోట పీహెచ్‌సీలలో ఇద్దరు డాక్టర్లుతోపాటు మూడు కింద స్థాయి సిబ్బంది పోస్టులు ఖాళీలు ఉన్నాయి.

గూడూరు నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు
గూడూరు రూరల్: 01,
చిల్లకూరు: 04, కోట: 01,
వాకాడు: 04, చిట్టమూరు: 04

అభ్యసన వైకల్యంపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో నడుస్తున్న భవిత స్కూల్‌లో అభ్యసన వైకల్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయిని వీటీ భార్గవి మాట్లాడుతూ చదువుల్లో వెనుకబడిన విద్యార్థుల్లో లోపాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చునని తెలిపారు. చదువుల వైపు మళ్లించేందుకు ఈ అవగాహన ర్యాలీని నిర్వహించామన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు ఎస్.సాయి సంధ్య, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మీటింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ

తడ: పానాసోనిక్ పరిశ్రమ మండలంలోని ఉపాధ్యాయులకు అవసరమైన మీటింగ్ హాల్ నిర్మాణం కోసం రూ.20 లక్షలు వెచ్చించనుంది. ప్రభుత్వ కార్యాలయ సముదాయాలు ఉన్న తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భవన నిర్మాణం కోసం శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమార్, ఎంఈఓలు మల్లికార్జునరావు, సరస్వతి, పరిశ్రమ ప్రతినిధులు, ఉపాధ్యాయుల, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు రాయితీ

సైదాపురం: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు రాయితీ కల్పిస్తున్నట్లు ఉద్యన శాఖాధికారి ఆనంద్ తెలిపారు. మండలంలోని చాగణం రాజుపాళెం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జీవామృతం తయారుచేసే విధానాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో ఉద్యాన శాఖాధికారులు వివరించారు. ఆనంద్ మాట్లాడుతూ నిమ్మ ,జామ సాగు చేసే రైతులకు హెక్టారుకు ప్రభుత్వం రూ.16 వేల నుంచి రూ.29 వేల రాయితీ ఇస్తుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ చెట్లుల్లో గజ్జి తెగులు వ్యాపిస్తుందని, నివారణకు బూటెక్స్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఓ హైమావతి మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-కేవైసీ చేసుకోవాలన్నారు. కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులను మంజూరు చేస్తున్నట్లు ఆమె వివరించారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో రైతులకు మినీగోకులాలను అందిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

నాయుడుపేట టౌన్: విద్యుత్ చార్జీలు పెంపుదలను వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం నాయుడుపేట విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రజలపై వివిధ రకాల పేర్లతో విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిలిపేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహేష్ బాబు, ముకుంద, వీరాస్వామి, మోహన్, ప్రతాప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం

ఓజిలి: ఆర్మేనిపాడు గ్రామంలో ఉన్న శ్రీరామ మందిరానికి దాతలు ఇచ్చిన 5.67 ఎకరాల భూమి అన్యాక్రాంతమవుతోంది. సర్వే నంబర్ 171-12లో 5.67 ఎకరాలు భూమిని కొంత మంది గ్రామస్తులు ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా పది దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ చోటా నాయకుడు ఆ భూమిని ఆక్రమించుకుని సీసీ రోడ్డు నిర్మించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. శనివారం పల్లెపండుగలో భాగంగా భూమిపూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. దేవదాయశాఖకు అప్పగించిన భూమిలో రోడ్డు నిర్మాణం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఆ చోటా నాయకుడు గ్రావెల్ తోలడంపై అధికారులు మౌనం వహిస్తున్నారు. దేవదాయశాఖ భూమిలో భూమి పూజ చేస్తున్నట్లు అటు పంచాయతీ కార్యదర్శి, దేవదాయశాఖ, రెవెన్యూ అధికారులకు సమాచారం లేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు, మామూళ్ల మత్తులో అధికారులు ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబును వివరణ కోరగా తనకు ఆర్మేనిపాడు గ్రామంలో దేవదాయశాఖ భూముల విషయం తెలియదని తెలిపారు. ఈఓను గ్రామానికి పంపి భూములను పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు.


దేవదాయశాఖకు అప్పగించిన భూమికి సంబంధించిన పత్రం

రీ సర్వేలో సమస్యలు పరిష్కరిస్తాం

ఓజిలి: రీ సర్వేలో భూ సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని తహసీల్దార్ పద్మావతి అన్నారు. మండలంలోని మానమాల గ్రామంలో శుక్రవారం రీ సర్వే గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామంలో సభ ఏర్పాటు చేసి ఎల్‌పీఎం నంబర్లులో మార్పులు చేర్పులు చేస్తున్నామన్నారు. సర్వే నంబర్లు తప్పుగా నమోదు కాబడి ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామస్తుల నుంచి పలు వినతిపత్రాలను స్వీకరించారు. ఆమె వెంట ఆర్ఐ విజయ్‌కుమార్, వీఆర్‌ఓ మస్తానయ్య, సర్వేయర్ నాగూర్‌బాషా, సిబ్బంది సాయి కృష్ణా తదితరులు ఉన్నారు.

గ్రామసభలో రీసర్వేపై వినతులు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు రీసర్వేపై పలువురు రైతులు వినతులు అందించారు. పట్టాదారు పేరు సక్రమంగా నమోదు కాకపోవడంతోపాటు సర్వే నంబరు, భూవిస్తీర్ణం తదితర సమస్యలపై పలువురు రైతులు స్థానిక తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డికి అర్జీలు అందించారు. గ్రామసభలో దాఖలైన అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ హరిహర, ఆర్ఐ సంతోషిబాయి, మండల సర్వేయర్ పూజిత, వీఆర్‌ఓ కళ్యాణి, సిబ్బంది శ్రీనివాసులు, వసుంధర, గ్రామస్తులు వీరకుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.


తాళ్వాయిపాడులో గ్రామసభ

సత్తా చాటిన కోటపోలూరు విద్యార్థులు

సూళ్లూరుపేట రూరల్: కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రజిత్ శుక్రవారం తెలిపారు. త్రోబాల్ అండర్-14 విభాగంలో సీహెచ్ అనిల్, అండర్-17లో పి. దివ్యశ్రీ, ఎన్.వర్ష, డి.సాయి, భార్గవ్ ఎంపికయ్యారు. టెన్నికాయిట్ అండర్-14 బాలికల విభాగంలో ఎం.షైనీ ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, పీఈటీ సన్నాయి భాస్కర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట: పట్టణంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లు మెయింటెనెన్స్ పనులున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని విద్యుత్‌శాఖ ఏడీఈ ఆర్.శేఖర్ తెలిపారు. ఈ నెల 22న సూళ్లూరుపేటకు తుపాన్ ముప్పు ఉండడంతో ముందస్తుగా అంతా సిద్ధం చేసుకోవడానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లను మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట రూరల్ మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దక్కిలి: మండలంలోని ఆల్తూరుపాడు గ్రామానికి చెందిన వీ.మల్లికార్జున (40) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం.. ఆల్తూరుపాడు గ్రామానికి చెందిన మల్లికార్జున గత నెల 30వ తేదీ చీకిరేణిపల్లి నుంచి మోటారు బైక్‌లో ఆల్తూరుపాడుకు వస్తుండగా అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు దక్కిలి పోలీసులు గురువారం రాత్రి బెంగళూరు వెళ్లి శవ పరీక్షలు నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం


విద్యార్థిని నిరోషాను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

దొరవారిసత్రం: ఢిల్లీలో గత నెలలో నిర్వహించిన 11వ ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్ కాంపిటేషన్‌లో పాల్గొన్న కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వాంకిల నిరోషాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంఈఓ కృష్ణయ్య, ఇతర ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థినికి జ్ఞాపికను అందించి సన్మానించారు. ట్రాలీ ఫర్ సీవేజ్ క్లీనింగ్ అనే పరికరాన్ని తయారు చేసి రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని, జాతీయ పోటీలకు ఎంపికైంది. హెచ్ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

గూడూరు రూరల్: అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ పక్కనే ఉన్న ఏఈ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో భారం మోపేందుకు సిద్ధమవుతోందన్నారు. దీనిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ ఏడుకొండలకు వినతి పత్రం అందించారు. నాయకులు జోగి శివకుమార్, పి.శ్రీనివాసులు, బీవీ రమణయ్య, ఎస్.సురేష్, పామంజి మణి, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

కోట: సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వేణు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజాసమస్యలను వెంటనే గుర్తించి అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని సూచించారు. కోటలోని పలు కాలనీల్లో మంచినీటి కొరత ఉందని ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తెచ్చారు. నీటిని తీరప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, గోవిందపల్లి వరకు సరఫరా చేయాలని మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్ అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జయజయరావు, జెడ్పీటీసీ కోటయ్య, వైస్ ఎంపీపీ శేషయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణు

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

దక్కిలి: ఉపాధిహామీ నిధులతో అన్ని గ్రామాల్లో పలు రకాలు అభివృద్ధి పనులు చేపడుతామని ఏపీఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని దక్కిలి, పాతనాలపాడు(కమ్మవారిపల్లి), దగ్గవోలు, కేబీ పల్లి(తూర్పుపల్లి), శ్రీపురం గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాతనాలపాడులో రూ.10 లక్షలు, శ్రీపురంలో రూ.5 లక్షలు, దక్కిలిలో రూ.10 లక్షలు, దగ్గవోలులో రూ.5 లక్షల పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలియజేశారు. ఈసీ దామోదర్‌రాజు, టెక్నికల్ అసిస్టెంట్ గిరి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

వెంకటగిరి రూరల్: విద్యార్థులు విద్యతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ పేర్కొన్నారు. పట్టణంలోని అమరావతి జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమీపంలో అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పోలీసు అధికారులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఓజిలి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశాన్ని శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు సరఫరా చేయాలని, ఎప్పటికప్పుడు ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. రైతులకు వరి విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కండలేరులో 34,720 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 34.720 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు వరద కాలువ నుంచి 500 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోందన్నారు.